సాక్షి
నల్లగొండ
సోమవారం ¦ 27 ¦ నవంబర్ ¦ 2023



ఏజెంట్లే కీలకం
పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరఫున ఓటర్లను పరిశీలించడంలో ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకం అని చెప్పవచ్చు. - 6లో



మోసగిస్తున్న సీఎం కేసీఆర్
ముస్లింలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని జమ్మూ కశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు వికాల్ రసూల్ అన్నారు. - 6లో



ఫాంహౌస్‌కు పరిమితం..
కేసీఆర్‌ను ఓడించి ఫాంహౌస్‌కు పరిమితం చేయాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. - 6లో

న్యూస్‌రీల్

డిసెంబర్ 3వ వారంలో వైజ్ఞానిక ప్రదర్శన

నల్లగొండ: రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి హైదరాబాద్, జిల్లా విద్యా శాఖల ఆధ్వర్యంలో డిసెంబర్ 3వ వారంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన (సైన్స్ ఫెయిర్) నిర్వహించనున్నట్లు డీఈఓ బొల్లారం భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ ఉప అంశాలుగా ఆరోగ్యం, జీవితం, పర్యావరణ శైలి, వ్యవసాయం, సమాచారం, రవాణ, కంప్యూటరైజేషన్ థింకింగ్‌లపై ప్రదర్శన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల్లోని గణితం, సైన్స్ ఉపాధ్యాయులు సమన్వయంతో ప్రతి పాఠశాల నుంచి 3 ప్రాజెక్టులు తక్కువ కాకుండా విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి సెల్ : 9848578845 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పోలింగ్ కేంద్రం సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న జనరల్ అబ్జర్వర్ బాలసుబ్రహ్మణ్యం

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లిలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు (జనరల్ అబ్జర్వర్) బాలసుబ్రహ్మణ్యం సందర్శించారు. కేంద్రంలో కల్పించిన వసతులు, ఇతర వివరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మ, కోనం శ్రీనివాస్, ఎంపీడీఓ యాదగిరి, ఎస్‌ఐ సైదాబాబు ఉన్నారు.

'మత్స్యగిరి' బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల మత్స్యగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం పరిసమాప్తం అయ్యాయి. చివరిరోజు ద్వార తోరణం, ధ్వజకుంభ ఆరాధన, మూర్తి కుంభారాధన, చతుస్నానార్చన, నిత్యహోమాలు, శ్రీ సుదర్శన నారసింహ ఇష్టి, పూర్ణాహుతి, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి తదితర పూజలు నిర్వహించారు.నాయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉజ్జయిని మహంకాళి ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి దంపతులు, మత్స్యగిరి ఆలయ ఈఓ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం సేవ, ఆరాధన, అనంతరం నిజాభిషేకం, అర్చన చేశారు. అలాగే ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన, అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.





జ్వాలాతోరణం
కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ ఛాయా సోమేశ్వరాలయం వద్ద నిర్వహించిన జ్వాలాతోరణం కార్యక్రమానికి హాజరైన భక్తజనం, జ్వాలా తోరణాన్ని వెలిగిస్తున్న కలెక్టర్ ఆర్వీ.కర్ణన్

ఆదరణ పొందేనా..!

బోణీ కొట్టాలని బీజేపీ.. పట్టు కోసం సీపీఎం

ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికీ బీజేపీ బోణీ కొట్టలేదు. ప్రతి ఎన్నికల్లో పోటీచేస్తున్నా గెలుపు దరికి చేరుకోవడం లేదు. పీడీఎఫ్ నుంచి గెలిచిన అభ్యర్థులను పక్కన పెడితే.. సీపీఐకి మూడు నియోజకవర్గాల్లోనే ప్రాతినిధ్యం దక్కింది(1962 ఎన్నికల వరకు సీపీఐ, సీపీఎం కలిసే ఉన్నాయి). సీపీఎం ఇప్పటివరకు ఏడు నియోజకవర్గాల్లో ఒక్కసారి కూడా గెలుపొంద లేదు. ఈ ఎన్నికల్లోనైనా బీజేపీ బోణీ కొడుతుందా?, సీపీఎం ఏ మేరకు పట్టు సాధిస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది. ఈసారి కాంగ్రెస్‌తో పొత్తు కారణంగా ఉమ్మడి జిల్లాలో సీపీఐ పోటీలో లేదు.

– సాక్షి ప్రతినిధి, నల్లగొండ

- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు బీజేపీకి దక్కని ప్రాతినిధ్యం
- ఐదు నియోజకవర్గాల్లోనే గెలిచిన సీపీఎం
- కమ్యూనిస్టు పార్టీ విడిపోయాక.. సీపీఐకి తొమ్మిది చోట్ల వరించని విజయం
- ఈసారైనా 'కమలం' వికసిస్తుందా.. సీపీఎంకు అవకాశం వస్తుందా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 నియోజకవర్గాలున్నాయి. అయితే ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలో ఒక్కసారి కూడా ఏ ఒక్క నియోజకవర్గం నుంచి బీజేపీకి ప్రాతినిధ్యం దక్కలేదు. 2004 ఎన్నికల్లో రామన్నపేట నియోజకవర్గంలో బీజేపీ నుంచి పోటీలో ఉన్న డి. మల్లేశం, 2022లో జరిగిన మునుగోడు ఉప ఎన్నికలో ఆ పార్టీ తరఫున బరిలో నిలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాత్రమే రెండో స్థానంలో నిలిచారు. మిగతా ఎవ్వరూ రెండో స్థానంలో కూడా నిలవలేదు. ఈసారి బీజేపీ అభ్యర్థులు 11 నియోజకవర్గాల్లో పోటీలో ఉన్నా గెలుస్తామా లేదా? అన్న ఆందోళన ఆ పార్టీలో నెలకొంది. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హోరాహోరీగా తలపడుతున్నాయి. ఇందులో బీజేపీ కూడా తమ అభ్యర్థులను ఎలాగైనా గెలిపించుకోవాలన్న లక్ష్యంతో జాతీయ నాయకులను రంగంలోకి దింపింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రులు, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా జిల్లాలో ప్రచార సభలు, సమావేశాలు, రోడ్‌షోలలో పాల్గొంటున్నారు. ఈసారైనా ఉమ్మడి జిల్లాలో బీజేపీ బోణీ చేస్తుందా.. గెలుపు కలగానే మిగులుతుందా? అన్నది త్వరలోనే తేలనుంది.

ఐదు చోట్ల గెలిచిన సీపీఎం

జిల్లాలోని 12 నియోజకవర్గాలకుగాను ఏడు చోట్ల సీపీఎం అభ్యర్థులు ఒక్కసారి కూడా గెలువలేదు. మిగతా ఐదు నియోజకర్గాల్లో మాత్రమే సీపీఎం అభ్యర్థులు పలుమార్లు గెలుపొందారు. వాటిల్లో కొన్నిసార్లు పొత్తుల్లో భాగంగా, మరికొన్నిసార్లు ఒంటరిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో ఆపార్టీ అభ్యర్థులు ఒంటరిగా బరిలో నిలిచారు.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీగా..

ఇక సీపీఐ(ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీగా ఉన్నప్పుడు)కి మూడు నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం దక్కలేదు. 1962 ఎన్నికల వరకు సీపీఐ, సీపీఎంలు (సీపీఐగా) కలిసే ఉన్నాయి. సీపీఐగానే ఎన్నికల బరిలో నిలిచాయి. ఉమ్మడిగా ఉన్న సమయంలో తొమ్మిది నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. కమ్యూనిస్టు పార్టీలు (సీపీఐ, సీపీఎంగా) విడిపోయాక 1967 నుంచి జరిగిన ఎన్నికల్లో సీపీఐకి మూడు చోట్ల ప్రాతినిధ్యం దక్కింది. తొమ్మిది చోట్ల ఆ పార్టీ గెలుపొందలేదు.

నియోజకవర్గాల వారీగా ఇదీ పరిస్థితి

నల్లగొండ నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన 16 ఎన్నికల్లో బీజేపీ ఒక్కసారి కూడా గెలువలేదు. నకిరేకల్ నియోజక వర్గంలో 14 సార్లు జరిగిన ఎన్నికల్లో ఒక్కసారి కూడా బీజేపీ, టీడీపీకి ప్రాతినిధ్యం లభించలేదు. మునుగోడులో బీజేపీ, టీడీపీ, సీపీఎం ఒక్కసారి కూడా గెలువలేదు. దేవరకొండ నుంచి బీజేపీ, సీపీఎం, టీడీపీకి ఒక్కసారి కూడా విజయం దరిచేరలేదు. నాగార్జునసాగర్ (పాత చలకుర్తి)లో సీపీఎం, బీజేపీలకు ఒక్కసారి కూడా ప్రాతినిధ్యం దక్కలేదు. మిర్యాలగూడలో బీజేపీ, టీడీపీ గెలువలేదు. సూర్యాపేట నియోజకవర్గంలో 15సార్లు ఎన్నికలు జరిగినా బీజేపీకి ఒక్కసారి కూడా విజయం వరించలేదు. తుంగతుర్తి నియోజకవర్గంలోనూ 13 సార్లు ఎన్నికలు జరగ్గా సీపీఐ, బీజేపీకి గెలిచే అవకాశం రాలేదు. హుజూర్‌నగర్‌లో పదిసార్లు జరిగిన ఎన్నికల్లో సీపీఎం, సీపీఐ, బీజేపీ, టీడీపీ ఒక్కసారి కూడా గెలుపొందలేదు. కోదాడలో పదిసార్లు ఎన్నికలు జరగగా.. బీజేపీ, సీపీఎం, సీపీఐ ఒక్కసారి కూడా గెలుపొందలేదు. ఆలేరులో 16 సార్లు ఎన్నికలు జరగగా.. సీపీఎం, బీజేపీలకు ప్రాతినిధ్యం లభించలేదు. భువనగిరి నియోజకవర్గంలో ఉప ఎన్నికలు సహా 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో సీపీఎం, బీజేపీ ఒక్కసారి కూడా విజయం సాధించలేకపోయాయి.

కేసీఆర్‌కు లబ్ధిచేకూరేలా మోదీ ప్లాన్

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా.. రైతు బంధు ఇవ్వడానికి అనుమతి ఎలా ఇస్తారని, కేసీఆర్‌కు లబ్ధిచేకూరడానికే మోదీ ఈ ప్లాన్ చేశారని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని పలు వార్డులలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. నవంబర్ 15లోపే రైతు బంధు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఎన్నికల కమిషన్ చేతిలో ఉందని ఇలా చేస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసు నుంచి కవితను మోదీ కాపాడింది ప్రజలందరికీ తెలుసని అన్నారు. ఈ రెండు దొంగ పార్టీలకు ప్రజలు బుద్ధిచెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్ రూ.లక్ష కోట్లు దోచుకుని మళ్లీ ఇంకో చాన్స్ అంటూ ప్రజల ముందుకు వచ్చి మాయమాటలు చెబుతున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. మాటమీద నిలబడి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రమంతా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఉద్యోగాలు లేక యువత రోడ్ల మీద తిరుగుతుంది. ఈ పరిస్థితులలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం చాలా అవసరమన్నారు. కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించకపోతే రాష్ట్ర ప్రజలకు తిప్పలు తప్పవన్నారు.

భారత రాజ్యాంగం చాలా గొప్పది



మాట్లాడుతున్న జడ్జి దీప్తి



మిర్యాలగూడ : అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

రామగిరి(నల్లగొండ): ప్రపంచంలోకెల్లా భారత రాజ్యాంగం చాలా గొప్పదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి.దీప్తి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని గిరిజన బాలికల వసతి గృహంలో భారత రాజ్యాంగ దినోత్సవం, నేషనల్ లా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం వాటిల్లితే పౌరులు కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. అందరూ స్వేచ్ఛగా జీవించగలుతున్నారంటే అది రాజ్యాంగం కల్పించిన వరమన్నారు. అనంతరం విద్యార్థులచే న్యాయ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లక్ష్మారెడ్డి, విజయలక్ష్మి, భీమనపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

మిర్యాలగూడ టౌన్: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ కస్తూరి ప్రభాకర్, బంజార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్, సామాజిక వేత్త డాక్టర్ జాడీ రాజు అన్నారు. రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మిర్యాలగూడలోని సాగర్ రోడ్డులో గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠిక ప్రతులపై ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు. భారత రాజ్యాంగంలో కల్పించబడిన హక్కులు అందరూ సమానంగా అనుభవించేలా పాలకులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. హక్కులకు భంగం వాటిల్లినప్పుడు ప్రభుత్వాలు వెంటనే స్పందించాలన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాద్గుల శ్రీనివాస్, సామాజిక వేత్త జ్వాల వెంకటేశ్వర్లు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, వివిధ సంఘాల నాయకులు జోసెఫ్, మురళియాదవ్, తిరుపతినాయక్, రావిరాల అంజయ్య, ప్రజాసైన్స్ వేదిక రాష్ట్ర కార్యదర్శి కందుకూరి సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భువనగిరికి ప్రియాంకగాంధీ

భువనగిరి టౌన్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ సోమవారం భువనగిరి రానున్నారు. భువనగిరిలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో ఉదయం 11.30కి దిగనున్నారు. అనంతరం భువనగిరి, ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున నిర్వహించనున్న రోడ్ షోలో ఆమె పాల్గొననున్నారు. వినాయక చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభలో ప్రియాంక ప్రసంగించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రోడ్ షోకు భారీ జన సమీకరణ చేసేందుకు పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె పర్యటనకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

పార్టీ మారతాననే ప్రచారం కాంగ్రెస్ కుట్ర

- శాసన మండలి ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: తాను పార్టీ మారుతున్నాననే దుష్ప్రచారం వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ దుష్ప్రచారంలో కాంగ్రెస్ నేతలతోపాటు నేనంటే పడని మా పార్టీ వాళ్లు కూడా ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్రతినిధులు కూడా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. తాను ఏదైనా ముక్కుసూటిగా మాట్లాడుతానని, తెర వెనుక రాజకీయం చేసే అలవాటు లేదని స్పష్టం చేశారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం విషం చిమ్ముందని, ప్రధాని జాతీయ దృక్పథంతో కాకుండా కులాలు, మతాలు అని ప్రోత్సహించడం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఖర్గే, బీజేపీ నుంచి మోదీ, అమిత్‌షా, నడ్డా, ఇతర కేంద్ర మంత్రులు తెలంగాణపై దండయాత్ర చేస్తూ అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12కు 12 అసెంబ్లీ స్థానాలు బీఆర్‌ఎస్ పార్టీ గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ కాళిందిని

నల్లగొండ: రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని, దాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ ఈనెల 30న తప్పకుండా వినియోగించుకోవాలని డీఆర్‌డీఓ కాళిందిని అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చర్లపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం– ఓటు హక్కు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం రాజ్యాంగం–ఓటు హక్కు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో జిల్లా క్షేత్ర ప్రచార అధికారి జి.కోటేశ్వర్‌రావు, హైమావతి, జి.స్వాతి, పి.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశానికి దిక్సూచి భువనగిరి

- విప్లవయోధులకు పుట్టినిల్లు
- ప్రజా సమస్యలపై పోరాటాలు చేసేది ఒక్క కమ్యూనిస్టులే
- ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి
- భువనగిరి రోడ్ షోలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



భువనగిరి రోడ్ షోలో పాల్గొన్న సీపీఎం శ్రేణులు

భువనగిరిటౌన్: భువనగిరి ప్రాంతం పోరాటాలకు కేంద్రంగా ఉందని, తెలంగాణ సాయుధ పోరాటంలో దేశానికే దిక్సూచిగా నిలిచిందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. భువనగిరి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ భువనగిరి పట్టణంలోని సాయిబాబా గుడి నుంచి భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోలో సీతారాం ఏచూరి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, లౌకికవాదం పూర్తిగా నిర్వీర్యం అయిందని, దేశాన్ని కాపాడుకునేందుకు ప్రజలందరూ ఆలోచన చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 నియోజకవర్గాల్లో సీపీఎం అభ్యర్థులు పోటీలో ఉన్నారని, మిగతా ప్రాంతాల్లో బీజేపీని ఓడించే పార్టీకి మద్దతు ఇస్తున్నామని చెప్పారు.

అసమానతలు లేనిది ఓటు ఒక్కటే : చెరుపల్లి సీతారాములు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. రావి నారాయణరెడ్డి, జైని మల్లయ్య గుప్తా లాంటి ఎందరో విప్లవ యోధులకు పుట్టినిల్లు భువనగిరి అని పేర్కొన్నారు. వారి వారసత్వాన్ని కమ్యూనిస్టులు పుణికిపుచ్చుకున్నారని.. రైతులు, వ్యవసాయ కూలీలు, వత్తిదారుల తరఫున అనేక ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. కుల, ఆర్థిక, సాంఘిక, రాజకీయ అసమానతలు ఉన్నాయని, అసమానతలు లేనిది ఓటు ఒక్కటేనని పేర్కొన్నారు. దేశ ప్రధానికైనా, పాలకులు సృష్టించిన దరిద్రుడికైనా ఓటరు లిస్టులో పేరు ఉంటే ఓటు వేసే హక్కు ఉంటుందని తెలిపారు. భువనగిరి అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి, నకిరేకల్‌లో వేముల వీరేశం ఈ ముగ్గురూ పార్టీలు మారి వచ్చిన వ్యక్తులేనన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే సీపీఎం అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీకి పంపాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఈ నెల 30 వరకు డబ్బు సంచులు, చికెన్, మటన్, మందు తీసుకొని వస్తారని, నాలుగు రోజులు ప్రజలు పత్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య బట్టుపల్లి అనురాధ. భువనగిరి, మునుగోడు, నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థులు కొండమడుగు నరసింహ, దోనూరు నర్సిరెడ్డి, బొజ్జ చిన్న వెంకులు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, వివిధ మండలాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారాం ఏచూరి, చిత్రంలో సీతారాములు, అభ్యర్థులు నర్సింహ, నర్సిరెడ్డి, చిన్న వెంకులు తదితరులు

నేడు మిర్యాలగూడలో సీతారాం ఏచూరి రోడ్‌షో

మిర్యాలగూడ: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం మిర్యాలగూడలో పర్యటించనున్నారు. సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డికి మద్దతుగా రోడ్ షో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతారాం ఏచూరికి ఉదయం 9 గంటలకు సీపీఎం కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలకనున్నారని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని హనుమాన్ పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్‌చౌక్ వరకు 2వేల బైక్‌లతో ర్యాలీ రోడ్ షో నిర్వహించనున్నట్టు తెలిపారు. రోడ్‌షో రాజీవ్‌చౌక్ వద్దకు చేరుకొని అక్కడ నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో సీతారాం ఏచూరి ప్రసంగించనున్నారు. రోడ్ షోకు సీపీఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



బంగారిగడ్డ గ్రామంలో సభాస్థలిని పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి, నాయకులు

సభను విజయవంతం చేయాలి

చండూరు: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 28న చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో నిర్వహించే మాదిగల సమరభేరి సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన బంగారిగడ్డలో సభ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరు కానున్న ఈ సభకు సుమారు 17 వేల మందికిపైగా తరలిరానున్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, అంజి, మనోహర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఓటరు పరిశీలనలో ఏజెంట్లే కీలకం



మిర్యాలగూడ టౌన్: పోలింగ్ కేంద్రంలో అభ్యర్థుల తరపున ఓటరు పరిశీలనలో పోలింగ్ ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకం అని చెప్పవచ్చు. పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లు బోగస్ వారా..? లేక నిజమైనా ఓటరా..? అని నిశితంగా పరిశీలిస్తారు. ఆయా పార్టీల అభ్యర్థులు అత్యంత విశ్వాస పాత్రులుగా ఉన్నవారిని మాత్రమే ఏజెంట్లుగా నియమించుకుంటారు.

నిబంధనలు ఇవే..

- పోలింగ్ కేంద్రాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు సంబధించిన పోలింగ్ ఏజెంట్లకు ప్రాధాన్య క్రమంలో కుర్చీలను వేస్తారు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రతి అభ్యర్థి తరఫున ఒక పోలింగ్ ఏజెంట్, ఇద్దరు రిలీఫ్ ఏజెంట్లను నియమించుకోవచ్చు.
- పోలింగ్ ఏజెంట్ల ఫారంలో పోటీ చేస్తున్న అభ్యర్థి లేదా అతని ఎన్నికల ఏజెంట్‌గా నియమితులైన వారికి ఏజెంట్ల పాసును జారీ చేస్తారు.
- ఒక్కో పోలింగ్ కేంద్రానికి మూడు పాసులను జారీ చేసినా ఒక్కరు మాత్రమే బూత్‌లో కూర్చోవటానికి అనుమతి ఇస్తారు. ఓటరు జాబితాను బయటకు తీసుకెళ్లేందుకు వీలు ఉండదు.
- పోలింగ్ ఏజెంట్లు ఓటరుగా నమోదై ఉండి, ఎన్నికల సంఘం ఫొటో గుర్తింపు కార్డు కూడా కలిగి ఉండాలి.
- పోలింగ్ ఏజెంట్లుగా నియమితులైన వారు ఓటింగ్ సమయానికి గంట ముందుగానే పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలి. ఆలస్యంగా వెళ్లినా అధికారులు వారి పనులను వారు కొనసాగిస్తారు. ఆలస్యం అయితే ఓటింగ్ యంత్రాల సీల్‌లో ఏజెంటు సంతకం చేయడం, పరిశీలన చేయలేకపోతారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంల సీలింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన తరువాతనే సంతకం చేయాలి.
- పోలింగ్ ఏజంట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్, వైర్‌లెస్, కార్డ్‌లెస్ పరికరాలను తీసుకెళ్లరాదు. పార్టీ కండువాలు, గుర్తులను ధరించవద్దు. ఓట్లు వేయని ఓటర్ల సంఖ్యను సూచించి వెలుపలికి పంపడం వంటివి చేయవద్దు.
- పోలింగ్ కేంద్రాల్లో జరిగే ప్రతి కదలిక, తతంగాన్ని పోలింగ్ ఏజెంట్లు నిశితంగా పరిశీలించి ఏ మాత్రం అనుమానం కలిగిన అధి కారులకు ఫిర్యాదు చేయవచ్చు.

రూ.50 కోట్లతో ఖిలా అభివృద్ధి

- మూసీని ప్రక్షాళన చేస్తాం
- బీజేపీ అభ్యర్థులను గెలిపించండి
- సకలజనుల విజయ సంకల్ప సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



భువనగిరిలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పక్కన భువనగిరి అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి, ఆలేరు అభ్యర్థి పడాల శ్రీనివాస్

భువనగిరి : 'హెలికాప్టర్‌లో వస్తూ భువనగిరి ఖిలాను చూశాను.. కోటపై శిథిలావస్థకు చేరిన కట్టడాలు చూస్తే బాధ అనిపించింది.. అభివృద్ధి చేయాలన్న సంకల్పం ఏర్పడింది' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరిలో ఏర్పాటు చేసిన సకలజనుల విజయ సంకల్ప సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఏనాడూ ఖిలాను పట్టించుకోలేదన్నారు. ఎంతో చారిత్రాత్మక నేపథ్యం కలిగిన భువనగిరి ఖిలాను రూ.50 కోట్లతో తామే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి కొలువై ఉన్న ప్రాంతానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని, జగద్గురు రేణుకాచార్యులు పుట్టిన గడ్డకు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ,భూదాన్‌పోచంపల్లి నుంచి వినోభాబావే భూదానోద్యమాన్ని ప్రారంభిస్తే ఇదే ప్రాంతం నుంచి కేసీఆర్ తన ఎమ్మెల్యేలతో కలిసి వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే భూములను కబ్జా చేయడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే మూసీ ప్రక్షాళన చేస్తామని చెప్పారు. భువనగిరి, ఆలేరు అభ్యర్థులు గూడూరు నారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్‌కు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

డబుల్ ఇంజన్ సర్కారు రావాలి : గూడూరు

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు రావాలని భువనగిరి అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి అన్నారు. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రధాని మోదీ తప్ప.. ఏ పార్టీ ప్రకటించకపోవడం బీసీలపై వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. భువనగిరిలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు, సంగెం, రుద్రవెల్లివద్ద మూసీపై వంతెనలు నిర్మించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.తనను గెలిపిస్తే ఐటీ హబ్ తీసుకువస్తానని, మూసీ ప్రక్షాళన చేయిస్తానని, సొంత నిధులతో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తానన్నారు.



అమిత్ షాను సన్మానిస్తున్న, యాదాద్రి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్

ఆలేరు అభివృద్ధికి కృషిచేస్తా: పడాల శ్రీనివాస్

బీఆర్ఎస్ పాలనలో ఆలేరు నియోజకవర్గం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని ఆలేరు అభ్యర్థి పడాల శ్రీనివాస్ పేర్కొన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతానన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడించి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, పాశం భాస్కర్, ఎస్సీ మోర్చా జాతీయ నాయకులు వేముల అశోక్, విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు చందా మహేందర్‌గుప్తా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, నాయకులు జనగాం కవిత, నరసింహచారి, రత్నపురం బలరాం, రావుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేడర్‌లో ఉత్సాహం

సభకు జనం భారీగా హాజరుకావడంతో పార్టీ కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. మధ్యాహ్నం 12గంటల నుంచే సభా ప్రాంగణానికి జనం రాక మొదలైంది. సభలో కుర్చీలన్నీ నిండిపోవడంతో వేలాది మంది బయటే ఉండిపోయారు. అమిత్‌షా ప్రసంగం 20 నిమిషాల పాటు కొనసాగింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

కేసీఆర్‌ను ఫాంహౌస్‌కు పరిమితం చేయాలి



తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం



సమావేశానికి హాజరైన ఉద్యమకారులు, ప్రముఖులు

- పదేళ్లుగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కేటీఆర్ ఎందుకు ప్రక్షాళన చేయలేదు
- స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు
- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం

నల్గొండ రూరల్: తెలంగాణ ఆత్మగౌరవం, సీఎం కేసీఆర్ అహంకారానికి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఈసారి కేసీఆర్‌ను ఓడించి ఫాంహౌస్‌కి పరిమితం చేయాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో చిన వెంకట్ రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పదేళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, కర్తవ్యాలు -తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ నేడు కేసీఆర్ కుటుంబ పాలనలో మగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో సాగర హారం, మిలియన్ మార్చ్ వంటివి చేపట్టవద్దని కేసీఆర్ తనపై ఒత్తిడి చేశారని చెప్పారు. రూ.30వేల కోట్లతో పూర్తయ్యే కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో రూ.1.50 లక్షల కోట్లకు పెంచి రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టాడని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా పదేళ్లుగా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, పేపర్ లీకేజీపై ఒక్క మాట కూడా మాట్లాడని మంత్రి కేటీఆర్ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. నల్లగొండ జిల్లాకు సంబంధించి ఉదయ సముద్రం ప్రాజెక్టు, శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టుకు రూ.13,000 కోట్లతో అయిపోయే ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టి ఈ జిల్లాకు అన్యాయం చేశారని ఆరోపించారు. ధరణి, రైతుబంధు, 24 గంటల కరెంట్ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రద్దు చేస్తుందని కేసీఆర్ అబద్ధాలు చెప్తున్నాడని, అందులో ఉన్న లోపాలను సవరించి కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడానికే టీజేఎస్ పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతుందని అన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షులు పన్నాల గోపాల్‌రెడ్డి, దర్శనం నరసింహ, ఎం. సంతోష్‌రెడ్డి, ఎల్. మధు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎం. గోనారెడ్డి, ధీరవత్ వీరనాయక్ పాల్గొన్నారు.

కనుల పండువగా జ్వాలా తోరణ వేడుక



పానగల్లులోని ఛాయా సోమేశ్వరాలయంలో జ్వాలా తోరణం కింది నుంచి వెళ్తున్న భక్తులు



జ్వాలా తోరణాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కర్ణన్, జిల్లా జడ్జి నాగరాజు దంపతులు

- భక్తులతో కిక్కిరిసిన ఛాయా సోమేశ్వరాలయం
- కుటుంబ సభ్యులతో పూజల్లో పాల్గొన్న జిల్లా జడ్జి నాగరాజు, కలెక్టర్ కర్ణన్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణ వేడుక కనుల పండువగా జరిగాయి. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. సోమవారం మధ్యాహ్నం కార్తీక పౌర్ణమి ముగిసిపోతుండడంతో ఆదివారం రోజునే భక్తులు ఆలయం ముందున్న కొలనులో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. జ్వాలా తోరణ వేడుకలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఆలయం ముందు వెదురు కర్రలను అడ్డంగా పెట్టి వాటిపై ఎండుగడ్డి, నెయ్యి పోసి జ్వాలను వెలిగించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర వేద పాఠశాల విద్యార్థులచే జ్వాలా తోరణం కింది నుంచి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. భక్తులు కూడా ప్రదక్షిణలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ, రుద్రసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, మేనేజర్ చింతల సత్యనారాయణ, శ్రీనివాస్‌శర్మ, గుండగోని శ్రీదేవి సోమశేఖర్, శేఖర్‌రెడ్డి, వెంకట్, నగేష్, రవి, హరిబాబు, వెంకటరెడ్డి, గంట్ల భరత్‌రెడ్డి, ఆలయ అర్చకులు జంగం ఉదయ్‌కుమార్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో కార్తీక పౌర్ణమి సందడి



యాదాద్రి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో పాటు కార్తీకమాసం కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్లు వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి సుమారు మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టినట్లు భక్తులు వెల్లడించారు. కార్తీకమాసం పురస్కరించుకొని కొండకు దిగువన వ్రత మండపంలో భక్తులు అధికంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు జరిపించారు. కొండపైన మాడ వీధిలో కార్తీక దీపారాధనలో భక్తులు పాల్గొన్నారు. వ్రత పూజలతో రూ.8,79,100 ఆదాయం వచ్చింది. ఇక ఆలయానికి నిత్యాదాయం రూ.62,94,674 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆకట్టుకున్న కర్ణాటక సంగీతం

యాదాద్రి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని విశిష్ట కార్యక్రమాలను ఆలయ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయ తూర్పు మాఢ వీధిలోని బ్రహ్మోత్సవ కల్యాణ మండపం ముందు జొన్నలగడ్డ సత్య శ్రీరామ్ బృందం హైదరాబాద్ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శత చండీ యాగం కొనసాగుతున్నాయి.

కారులో కోదాడ వాసి సజీవ దహనం

- హైదరాబాద్ శివారులోని ఔటర్ రింగ్‌రోడ్డుపై దుర్ఘటన



వెంకటేష్ (ఫైల్)

కోదాడ: హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కోదాడ పట్టణానికి చెందిన యువకుడు కారులో సజీవ దహనమయ్యా డు. కోదాడకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బడుగుల సైదులు పెద్ద కుమారుడు వెంకటేష్(26) సీఏ పూర్తి చేశాడు. పది రోజుల్లో ఇంగ్లండ్‌కు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నాడు. అందులో భాగంగానే పని నిమిత్తం శనివారం కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. రాత్రి 11గంటల సమయంలో ఔటర్ రింగ్ రోడ్డు ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో కారు మంటల్లో చిక్కుకోవడంతో వెంకటేష్ సజీవ దహనమయ్యాడు. కారు ఎలా మంటల్లో చిక్కుకుందో అర్థం కావడం లేదని వెంకటేష్ కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆదిబట్ల పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేష్ మృతికి ఈవీరెడ్డి కళా శాల కరస్పాండెంట్ గింజల రమణారెడ్డి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేట్ అధ్యాపకుల అసోసియేషన్ ప్రగాఢ సానుభూతి తెలియచేసింది.

బీఎల్‌ఆర్‌కు మాతృ వియోగం



వెంకట్రావమ్మ (ఫైల్)

మిర్యాలగూడ: మిర్యాలగూడ కాంగ్రెస్ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్) ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆదివారం ఆయన మాతృమూర్తి బత్తుల వెంకట్రావమ్మ (80) అనారోగ్యంతో మృతిచెందింది. తల్లి మరణవార్త తెలుసుకున్న బత్తుల లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నుంచి హుటాహుటిన మిర్యాలగూడ పట్టణంలోని తన ఇంటికి వెళ్లారు. వెంకట్రావమ్మ మరణవార్త తెలుసుకున్న పలువురు రాజకీయ పార్టీల నాయకులు ఆమె మృతదేహానికి నివాళులర్పించి బీఎల్‌ఆర్‌ను పరామర్శించారు.

రూ. 9.03లక్షలు స్వాధీనం

సూర్యాపేట క్రైం: వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.9.03లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణ సీఐ రాజశేఖర్ స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన నర్సారాం అనే వ్యాపారి హైదరాబాద్‌కు కారులో తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నగదును గ్రీవెన్స్ బృందానికి అప్పగించినట్లు డీఎస్పీ తెలిపారు.

డ్రోన్‌తో వినూత్న ప్రచారం



నల్లగొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి డ్రోన్ కెమెరాకు బీఆర్ఎస్ జెండాను కట్టి ఆకాశంలో తిప్పుతూ వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ముస్లింలను మోసగిస్తున్న సీఎం కేసీఆర్

- జమ్మూ కశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు వికార్ రసూల్



సమావేశంలో మాట్లాడుతున్న వికార్ రసూల్

మిర్యాలగూడ: తెలంగాణ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి గత పదేళ్లుగా సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని జమ్మూ కశ్మీర్ పీసీసీ అధ్యక్షుడు వికార్ రసూల్ విమర్శించారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎల్‌ఆర్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ భూములను ధరణి పేరుతో స్వాహా చేశారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను బీఆర్ఎస్ నాయకులు కాపీ కొట్టారని ఎద్దేవా చేశారు. గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇస్తామని ఇప్పుడు ప్రకటించారని, ఇంతకుముందు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఓడిపోతాననే భయంతో కేసీఆర్ మతిస్థిమితం లేకుండా మాయమాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ ఎస్‌కె.నవాజ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎ.సలీం, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంఎ.ఆరీఫ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జాని, మోయిజ్, అజర్, అబ్దుల్లా, పర్వేజ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోంచి జారిపడి కండక్టర్ దుర్మరణం



కండక్టర్ సత్తిరెడ్డి మృతదేహం

భూదాన్‌పోచంపల్లి : ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో ఫుట్‌బోర్డు నుంచి జారి కిందపడి కండక్టర్ మృతిచెందాడు. భూదాన్‌పోచంపల్లి జలాల్‌పురం గ్రామశివారులో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 50 మందికి పైగా ప్రయాణికులతో ఆదివారం సాయంత్రం 6.20గంటలకు పోచంపల్లి నుంచి సొంత డిపోకు బయలుదేరింది. బస్సులో బిహార్ రాష్ట్రానికి చెందిన కోళ్ల ఫారాల్లో పనిచేసే దాంజీరామ్ కూడా జలాల్‌పురం వరకు టికెట్ తీసుకున్నాడు.బస్సు జలాల్‌పురం దాటగానే కండక్టర్ దేవినేని సత్తిరెడ్డి(59) ప్రయాణికులకు టికెట్లు ఇస్తూ ముందు ఫుట్‌బోర్డు వైపు వచ్చాడు. ఇదే క్రమంలో దాంజీరామ్ తాను దిగాల్సిన స్టేజీ దాటిపోతుందని భావించి వేగంగా కదులుతున్న బస్సులోంచి ఒక్కసారిగా కిందికి దూకాడు. గమనించిన బస్సుడ్రైవర్ పోచంపల్లికి చెందిన మక్తాల సాయి సడెన్ బ్రేక్ వేయడంతో ముందు ఫుట్‌బోర్డు సమీపంలో ఉన్న కండక్టర్ బస్సులోంచి జారి కిందరోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బస్సులోంచి దూకిన దాంజీరామ్ తలకు తీవ్ర గాయాలు కాగా అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన కండక్టర్ సత్తిరెడ్డి హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌లో స్థిరనివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. బస్సు డ్రైవర్ మక్తాల సాయి ఏడాది క్రితం భూదాన్‌పోచంపల్లి మండల శివారులో బైక్‌ను ఢీకొట్టి వాహనదారుడి మృతికి కారణమయ్యాడు. దాంతో అప్పుడు ఇతనిపై కేసు నమోదయ్యింది. ఈ మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

బొలేరో ఢీకొని గీత కార్మికుడి మృతి



చంద్రయ్య (ఫైల్)

నల్లగొండ క్రైం: బొలేరో వాహనం అతివేగంతో బైక్‌ను ఢీకొట్టడంతో గీత కార్మికుడు మృతిచెందాడు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కట్టంగూర్ మండల కేంద్రానికి చెందిన పోగుల చంద్రయ్య గౌడ్ (48) భార్య, ఏడాదిలోపు కుమార్తెతో కలసి కొంతకాలంగా నల్లగొండ మున్సిపాలిటీ పరిధి గిరకబావిగూడెం గ్రామంలో నివసిస్తూ, స్థానికంగా కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం చంద్రయ్య మాంసం కొనుగోలుకు తన బైక్‌పై హైదరాబాద్ రోడ్డులో గల అఖిల్ ఫంక్షన్ హాల్ సమీపానికి వచ్చాడు. అక్కడే ఫుట్‌పాత్‌పై విక్రయిస్తున్న మాంసం కొనుగోలు చేసుకుని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన బొలేరో వాహనం తొలుత చంద్రయ్య వాహనాన్ని, ఆ తర్వాత రోడ్డు పక్కన నిలిపిన బైక్‌లను ఢీకొట్టింది. ప్రమాదంలో చంద్రయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని తొలుత జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడినుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వాహనాన్ని అక్కడే వదిలేసి బొలేరో డ్రైవర్ పరారయ్యాడు. పోస్టుమార్టం నిమిత్తం చంద్రయ్య మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

మట్టపల్లిలో నిత్యపూజలు



గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆదివారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకార్చనలు, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు అలంకరించి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన నారసింహుడు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి మట్టపల్లిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. ఆలయ తిరు మాఢ వీధుల్లో భక్తులు, అర్చకులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి భక్తులుకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బీబీనగర్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. బీబీనగర్ మండలంలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బీబీనగర్ మండల పరిధిలోని పగిడిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. వెంటనే భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు 35సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న వ్యక్తి ఒంటిపై నలుపు రంగు షర్టు, గోధుమ రంగు పాయింట్ ధరించి ఉన్నాడు. గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.